క్లుప్తంగా

పెన్షన్ల పంపిణీలో పాటించని ప్రొటోకాల్

సత్తెనపల్లి: ప్రభుత్వం లబ్ధిదారులకు అందించే ఎన్టీఆర్ భరోసా పెన్షన్ డబ్బులను ఏ అర్హత లేని కొందరు టీడీపీ నాయకులు.. ప్రభుత్వానికి సంబంధం లేని కొందరు వ్యక్తులు పంపిణీ చేయడం చూస్తూ ఉంటే ఆశ్చర్యకరంగా ఉందని పలువురు కౌన్సిలర్లు సోమవారం విమర్శలు వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా గెలుపొందిన కౌన్సిలర్లకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా ప్రొటోకాల్ పాటించకుండా పెన్షన్లు పంపిణీ చయడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బుతో ప్రైవేట్ వ్యక్తులకు ఏమిటి సంబంధం అని ప్రశ్నించారు. కనీసం అధికారులైనా ఇలాంటి విషయాలలో జాగ్రత్తలు తీసుకోకపోవడం దౌర్భాగ్యం అని, దీనిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామని పలువురు కౌన్సిలర్లు తెలిపారు.

అతిసారపై అప్రమత్తత అవసరం



చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): అతిసార ప్రమాదకరమైందని, లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని ముప్పాళ్ళ పీహెచ్‌సీ వైద్యాధికారి పి.రమాదేవి చెప్పారు. మండలంలోని అన్ని గ్రామాల్లోను స్టాప్ డయేరియా కార్యక్రమం సోమవారం నిర్వహించారు. చాగంటివారిపాలెంలో జరిగిన ర్యాలీలో ఆమె పాల్గొని విరేచనాలు రెండు, మూడు సార్లు కంటే ఎక్కువగా అయితే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. చిన్నపిల్లల్లో తల్లి పాలు తాగకపోవడం, తక్కువగా తాగడం లాంటి లక్షణాలు కనిపిస్తాయన్నారు. తరచూ అనారోగ్యానికి గురవుతూ ఉంటారన్నారు. అతిసార వ్యాధి వస్తే ఓఆర్ఎస్, జింక్ టాబ్లెట్‌లు వాడాలన్నారు. కార్యక్రమంలో భాగంగా గ్రామస్తులతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సూపర్‌వైజర్ పీటర్ డేమియన్, జోస్పిన్‌రాణి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మూగజీవాలకు వ్యాధి నిరోధక టీకాలు

క్రోసూరు: మండలంలోని అన్ని గ్రామాల్లో మూగజీవాలకు నీలినాలుక వ్యాధి నిరోధక టీకాలు మంగళవారం నుంచి వేస్తున్నట్లు మండల పశు వైద్యులు డాక్టర్ మల్లయ్య సోమవారం తెలిపారు. తొలిరోజు బయ్యవరం, అనంతవరం గ్రామాలు, 3వ తేదీ ఊటుకూరు, దొడ్లేరు గ్రామాలు, 4న అందుకూరు, హసనాబాద్, 5వ తేదీ క్రోసూరు, గుడిపాడు, 6న 88త్యాళ్లూరు, ఆవులవారిపాలెం, 8వ తేదీ ఉయ్యందన గ్రామాల్లో టీకాలు వేయనున్నట్లు తెలిపారు. మూగజీవాల పోషకులు ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

ఆర్గానిక్ కిచెన్ గార్డెన్ విత్తనాలు పంపిణీ



పెదకూరపాడు: మండలంలోని 75 త్యాళ్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఆర్గానిక్ కిచెన్ గార్డెన్‌కు సంబంధించి ఆకుకూరలు, కాయగూరల విత్తనాలను ఎన్నారై పాఠశాల అభివృద్ధి దాత గుత్తికొండ గురువారెడ్డి, పేరెంట్స్ కమిటీ చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి ద్వారా విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం అనపరెడ్డి శ్రీనివాసరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయురాలు అరుణశ్రీ మాట్లాడుతూ పురుగు మందులు లేకుండా, ప్రకృతి వ్యవసాయం ప్రోత్సహించేలా విద్యార్థులకు అవగాహన కోసం పాఠశాలలో మన బడి–సాగుబడి నిర్వహిస్తున్నామన్నారు. పాలకూర, చుక్కకూర, బీర, బెండ, దోస, తదితర విత్తనాలను ఎన్నారై గురువారెడ్డి సహకారంతో అందించామన్నారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. విత్తనాలు అందజేసిన దాత గురువారెడ్డికి ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతులకు విత్తనాలు అందజేత



బెల్లంకొండ: ప్రభుత్వం ద్వారా రైతులకు అందించే రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ తెలిపారు. సోమవారం మండల కేంద్రమైన బెల్లంకొండలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీ విత్తనాల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. వ్యవసాయ శాఖ ఏపీ సీడ్స్ వారి నుంచి ఖరీఫ్ 2024 సాగుకు రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మండల వ్యవసాయాధికారి డి.కృష్ణయ్య మాట్లాడుతూ కంది విత్తనాలు 30 శాతం రాయితీపై అందిస్తున్నామని తెలిపారు. ఎకరాకు 4 కేజీలు విత్తుకోవాలని 4 కేజీల విత్తనాల పూర్తి ఖరీదు రూ.559.20 కాగా రాయితీ 30 శాతం పోగా రైతు వాటాగా రూ.391.44 చెల్లించాలన్నారు. రైతులు సిబ్బందిని సంప్రదించి విత్తనాలు పొందాలని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర మైనార్టీ ప్రధాన కార్యదర్శి పీయస్కే మస్తాన్ షరీఫ్, సర్పంచ్ గడిపర్తి జ్యోతి సముద్రం, మండల నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఔషధంతో పునర్జన్మనిచ్చేది వైద్యులు

- న్యాయవాది చలువాది చిన్నసత్యనారాయణ
- ఘనంగా జాతీయ వైద్యుల దినోత్సవం

సత్తెనపల్లి: ఏ జీవికైనా ప్రాణం పోసేది అమ్మ అని, అదే జీవి అనారోగ్యం పాలైతే ఔషధాన్ని ఇచ్చి కాపాడి పునర్జన్మనిచ్చేది వైద్యుడు అని సీనియర్ న్యాయవాది చలువాది చిన్న సత్యనారాయణ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకొని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు మద్ది వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ సుధాకర్‌రావు, దంత వైద్య నిపుణుడు డాక్టర్ సత్యనారాయణలను సోమవారం సత్కరించారు. ఈ సందర్భంగా చిన్న సత్యనారాయణ మాట్లాడుతూ వీరు ఈ ప్రాంత ప్రజలకు అనేక సంవత్సరాలుగా సేవలందిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు కృష్ణ, శ్రీనివాసరావు, రత్తయ్య, నరసింహారావు, వెంకటరమణ, వెంకటేశ్వర్లు, ప్రసాద్, హరినాథ్, భరత్, హరికుమార్ పాల్గొన్నారు.

వైద్యులు దైవ స్వరూపులు..

రోగి ప్రాణాలు కాపాడే విషయంలో వైద్యులు పడే శ్రమ వర్ణనాతీతం అని అందుకే వైద్యులను దైవ స్వరూపంగా భావిస్తారని ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శ్యాంసన్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా నరసరావుపేట ఏరియా వైద్యశాలలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న సత్తెనపల్లికి చెందిన డాక్టర్ మంత్రు నాయక్‌ను సోమవారం సత్తెనపల్లిలో సత్కరించారు. ముందుగా డాక్టర్ బీసీ రాయ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్యాంసన్ మాట్లాడుతూ బీసీ రాయ్ దేశీయ వైద్య రంగంలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచేందుకు అవిశ్రాంతంగా కృషి చేశారన్నారు.

అర్బన్ వైద్యాధికారి ధర్మసింగ్ శాస్త్రికి సత్కారం

పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డ్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ జి.ధర్మసింగ్ శాస్త్రిని సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. వైద్య రంగంలో ఆయన అందిస్తున్న సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది



డాక్టర్ ధర్మసింగ్ శాస్త్రిని సత్కరిస్తున్న వైద్య సిబ్బంది



డాక్టర్ సుష్మను సన్మానిస్తున్న బాధ్యులు

డి.సుధారాణి, ఉదయ్‌భాస్కర్, సతీష్‌కుమార్, కిషోర్, శైలజ, తదితరులు ఉన్నారు.

ఆర్యవైశ్య, యువజన సంఘం ఆధ్వర్యంలో...

జాతీయ వైద్య దినోత్సవ వేడుకలు ఆర్యవైశ్య సంఘం, యువజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ప్రముఖ కార్డియాలజిస్ట్ చల్లా నాగరాజారెడ్డి, డాక్టర్ జ్యోతి నాగరాజారెడ్డి, దంత వైద్య నిపుణుడు డాక్టర్ పోసాని ప్రసన్న కుమార్‌లను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం గౌరవ అధ్యక్షుడు కొత్త రామకృష్ణ, ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు మద్ది వెంకటేశ్వర్లు, అడ్వకేట్ దివ్వెల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో...

సత్తెనపల్లి: ప్రాణాపాయం నుంచి ప్రజలను రక్షించే వైద్యులు కనిపించే దైవం అని లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తెనపల్లి టౌన్ నూతన అధ్యక్షులు లయన్ పొన్నెకంటి కిషోర్ కుమార్ అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవం పురస్కరించుకుని లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు వైద్యులను సోమవారం సన్మానించారు. కిషోర్‌కుమార్ మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం డాక్టర్స్ డే నిర్వహిస్తున్నామని, లయన్‌స్టిక్ ఇయర్ కూడా డాక్టర్స్ డే అయిన జూలై ఒకటి నుంచి మొదలవుతుందన్నారు. క్లబ్ కార్యకలాపాలు డాక్టర్స్‌ను సన్మానించుకోవడంతో ప్రారంభం అవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ వైద్యులు కొఠారు సత్యనారాయణ,



ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ లక్ష్మణరావును సత్కరిస్తున్న ఆర్యవైశ్య నాయకులు

సుష్మ, బ్రహ్మయ్య, పాలేటి నవీన్ కుమార్, రాహుల్, బాజీబాబు, కృష్ణమాచార్యులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్యదర్శి లయన్ వీరాంజనేయులు, కోశాధికారి లయన్ బి.రోశయ్య, సీనియర్ సభ్యులు లయన్ ఎం.వెంకటేశ్వరరావు, టి.భావనారాయణ, కె.వెంకటేశ్వర్లు, కె.విష్ణువర్ధనరావు, పి.వెంకటేశ్వర్లు, పి.రామకోటయ్య, వి.కృష్ణమాచార్యులు, కె.రాజశేఖర్లు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు డాక్టర్ మధుసూదనరావు

అచ్చంపేట: అచ్చంపేట మండలంలో గత 40 సంవత్సరాలుగా గ్రామీణ ప్రాంతాల వారికి వైద్యసేవలు అందజేస్తూ నేటి తరం వైద్యులకు, ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు ఆదర్శ ప్రాయుడిగా నిలచిన మహోన్నత వ్యక్తి డాక్టర్ ఎం.మధుసూదనరావు అని ఆర్ఎంపీ, పీఎంపీ డాక్టర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ షేక్ అబ్దుల్లా, డాక్టర్ సైదాసాహెబ్‌లు అన్నారు. జాతీయ వైద్యుల దినోత్సవంలో భాగంగా సోమవారం అచ్చంపేట మండలంలోని అన్ని గ్రామాల ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులు డాక్టర్ మధుసూధనరావును ఘనంగా సన్మానించారు. 80



డాక్టర్ మధుసూదనరావును సన్మానిస్తున్న అసోసియేషన్ సభ్యులు



పట్టణంలో డాక్టర్ మంత్రూనాయక్‌ను సత్కరిస్తున్న శ్యాంసన్

సంవత్సరాల వయస్సులో కూడా సేవే లక్ష్యంగా ఉదయం 7 గంటలకే వైద్యశాలకు వచ్చే డాక్టర్ మధుసుధనరావేనన్నారు. పట్టణాల నుంచి కూడా వచ్చి ఆయన చేత వైద్యం చేయించుకుంటారని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు డాక్టర్ జి.శ్రీనివాసరెడ్డి, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ మల్లిఖార్జునరావు, డాక్టర్ మోహనరావు, డాక్టర్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ఈడీస్ దోమ కాటు వలనే డెంగీ

ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్



ఫణిదంలో డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీలో డాక్టర్ ప్రదీప్, సిబ్బంది

సత్తెనపల్లి: వర్షాకాలం వచ్చిందంటే వ్యాధుల కాలం ఆరంభమైనట్లేనని, ఈడీస్ అనే దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుందని ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. సత్తెనపల్లి మండలం ఫణిదం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో సోమవారం డెంగీ వ్యతిరేక మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రదీప్ మాట్లాడుతూ ఈడీస్ దోమ కాటు వల్ల డెంగీ వ్యాపిస్తుందని, వైరల్ మాదిరిగా అకస్మాత్తుగా జ్వరం వస్తుందన్నారు. తల నొప్పి, ఒళ్లు నొప్పులు, ఎముకలు విరిగేటంత నొప్పి ఉంటుందన్నారు. ఒక్కోసారి శరీర అంతర్భాగాల్లో రక్తస్రావం ఉంటుందన్నారు. కాళ్లు, చేతులు, ముఖం, వీపు, ఉదర భాగాల చర్మంపై ఎర్రగా కందినట్లు చిన్న పాటి పొక్కులు వస్తాయన్నారు. ప్లేట్‌లెట్స్ పడిపోయి రోగి పరిస్థితి విషమంగా మారుతుందన్నారు. పూల కుండీలు, ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగిపడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు వంటి వాటిల్లో చేరిన వర్షపు నీటిలో ఈడీస్ దోమలు వృద్ధి చెందుతాయన్నారు. కనుక పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. దోమ తెరలు వాడటం మేలని, వారంలో ఒక రోజు డ్రైడేగా పాటించాలన్నారు. జ్వర లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ జీవీసీకే మీనాక్షమ్మ, ఆరోగ్య పర్యవేక్షకురాలు ఏ వరలక్ష్మి, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

పలు ప్రాంతాల్లో పింఛన్లు పంపిణీ

రాజుపాలెం: మండలంలోని 14 గ్రామ సచివాలయాల్లోని సిబ్బంది సామాజిక పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచే పింఛన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించగా మధ్యలో అప్పుడప్పుడు సర్వర్ పనిచేయకపోవడం వలన ఇబ్బందులకు గురి అయ్యారు. మండలంలో 93 శాతం పింఛన్‌లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో రామకృష్ణప్రసాద్ తెలిపారు. మొత్తం 7,065 పింఛన్లకు గాను సుమారు 6,470 పింఛన్‌లు పంపిణీ చేసినట్లు తెలిపారు. కూటమి సభ్యులు సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కూటమి నాయకులు పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అచ్చంపేటలో...

అచ్చంపేట: మండలంలో 83 శాతం సామాజిక పెన్షన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో పి.కుసుమ కుమారి తెలిపారు. మండలంలో మొత్తం 8,984 మంది పెన్షను దారులుండగా 7,468 మందికి పంపిణీ చేశామన్నారు. మూడు నెలలకు పెరిగిన పింఛన్ కలిపి



రాజుపాలెంలో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు

మొత్తం రూ.7,000, దివ్యాంగులకు రూ.6,000 ఇవ్వడం జరిగిందన్నారు. సచివాలయ ఉద్యోగులు, కాంట్రాక్టు ఉద్యోగులతో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలచేత పంపిణీ చేయించినట్లు చెప్పారు.

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లోను ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం సోమవారం జరిగింది. ఆయా గ్రామ సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు లబ్ధిదారులకు పింఛన్ సొమ్మును అందించారు. ముప్పాళ్ళలో పంపిణీ కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి, వెటర్నరీ ఏడీఏ కాంతారావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీ ప్రసాదులు పరిశీలించారు. ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు పాల్గొన్నారు.



ముప్పాళ్లలో పింఛన్ అందిస్తున్న డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీప్రసాద్ తదితరులు

పెదకూరపాడులో...

పెదకూరపాడు: సోమవారం పెదకూరపాడులోని ముస్లిం కాలనీలోని జెండా చెట్టు వద్ద ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పెన్షన్లు పంపిణీ చేశారు. సీఎం చంద్రబాబు చిత్రపటానికి, పెదకూరపాడులో ఎన్టీఆర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు.

ఎన్నికల హామీల అమలే పెంచిన పింఛన్‌లు

గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు



సత్తెనపల్లిలో పింఛన్ పంపిణీ చేస్తున్న మాజీ మేయర్ నాగరాజు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సోమవారం గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులతో ఇంటి దగ్గరే ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయడం ఆనందించాల్సిన విషయం అని గుంటూరు నగర మాజీ మేయర్ కన్నా నాగరాజు అన్నారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 11 కేటగిరీల పింఛన్‌దారులకు ఏప్రిల్, మే, జూన్ నెల అరియర్స్ రూ.3 వేలు, ఈ నెల 1న పెంచిన పింఛన్ రూ.4 వేలతో కలిపి మొత్తం రూ.7 వేలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం ఎన్నికల హామీ అమలుపరచడం జరిగిందన్నారు. ప్రజల సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. అలాగే పట్టణంలోని వివిధ వార్డుల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో సచివాలయ ఉద్యోగులతో కలిసి టీడీపీ నాయకులు పింఛన్ల పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ యెల్లినేడి రామస్వామి, నాయకులు దరువూరి నాగేశ్వరరావు, తోట అంబికా, కోమటినేని శ్రీనివాసరావు, యక్కల బుల్లిస్వామి, ఆయా వార్డుల్లో టీడీపీ నాయకులు, ఆయా గ్రామాల్లో పార్టీ నాయకులు, సచివాలయ ఉద్యోగులు, పాల్గొన్నారు.

పెన్షన్ పథకం టీడీపీ హయాంలోనే ప్రారంభం

ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్



అచ్చంపేట ఎస్సీ కాలనీలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అచ్చంపేట: నిరుపేదలకు అండగా దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు రూ.35తో పెన్షన్ పథకాన్ని ప్రవేశపెట్టారని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ అన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకంలో భాగంగా స్థానిక వాగొడ్డు ఎస్సీ కాలనీలో సోమవారం ఆయన పెన్షన్ పంపిణీ చేసి మాట్లాడారు. కార్యక్రమంలో సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రోసూరులో...

క్రోసూరు: ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీ కార్యక్రమంలో సోమవారం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పాల్గొన్నారు. పలువురికి ఆయన పింఛన్ అందజేశారు. కార్యక్రమంలో పలువురు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అమరావతిలో...

అమరావతి: ఈ నెల నుంచి పెంచిన పెన్షన్ నగదును ప్రభుత్వ ఉద్యోగులు పంపిణీ చేశారు. పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మండలంలోని లేమల్లె గ్రామంలో పింఛన్ల పంపిణీ ప్రారంభించారు. అమరావతి, మునగోడు, వైకుంఠపురం గ్రామాలలో ఎంపీపీ మేకల హనుమంతరావు, పల్నాడు జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఆలోకం సుధాకరబాబులు పింఛన్ పంపిణీ నిర్వహించారు. ఎంపీడీవో రాణి, సోషల్ వెల్ఫేర్ అధికారులు, బీజేపీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

డయేరియా పట్ల అప్రమత్తంగా ఉండాలి

అమరావతి: ప్రస్తుతం రాష్ట్రంలో విస్తరిస్తున్న డయేరియా, డెంగీ వ్యాధుల పట్ల అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. సోమవారం స్థానిక సీహెచ్‌సీలో నిర్వహించిన డయేరియా క్యాంపెయిన్, డెంగీ వ్యతిరేక మాసోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి అత్తలూరు పీహెచ్‌సీ వైద్యాధికారి శివరత్నకుమార్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ హనుమంతరావు మాట్లాడుతూ గ్రామాలలో పరిసరాలు పరిశుభ్రంగా ఉన్నప్పుడే ప్రాణాంతకమైన డయేరియా, డెంగీ వంటి వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉంటాయన్నారు. గ్రామాలలో పారిశుధ్య పరిస్థితిని గ్రామ స్థాయి ఉద్యోగులు, వైద్యాధికారులు సమీక్షించుకొని సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామాలలో ప్రజాప్రతినిధులతో పాటు ఆరోగ్య శాఖ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు పారిశుధ్యానికి కృషి చేయాలన్నారు. మురుగు నీరు నిల్వ ఉండకుండా, దోమల నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ట్యాంకులను, సంపులను క్లోరినేషన్ చేయాలన్నారు. వ్యాధులు ప్రబలితే హెల్త్ క్యాంప్‌లు నిర్వహించటానికి సిద్ధంగా ఉడాలన్నారు. ఈ సమావేశంలో వెద్యాధికారులు మౌనిక, హరిబాబు, రవికుమార్ లక్ష్మి మనోహర్, ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అతిసార నియంత్రణపై విస్తృత ప్రచారం చేపట్టాలి

సత్తెనపల్లి: వాతావరణంలో మార్పుల కారణంగా సీజనల్ వ్యాధులు ప్రబలే ఆస్కారం ఉందని, అతిసార నియంత్రణపై విస్తృత ప్రచారం చేయాలని ఫణిదం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ వి.ప్రదీప్ అన్నారు. ఈ నెల 1 నుంచి ఆగస్టు వరకు రెండు నెలలు పాటు డయేరియాను ఆపండి క్యాంపెయిన్‌లో భాగంగా సోమవారం ఫణిదం పీహెచ్‌సీలో వాల్ పోస్టర్లను ఆవిష్కరించి వైద్య సిబ్బందితో సమావేశంలో ఆయన మాట్లాడారు. కలుషిత నీరు, ఆహారం వల్ల డయేరియా వస్తుందని, ఈగలు వాలిన ఆహార పదార్థాలు తినడం వల్ల వ్యాధికారక క్రిములు జీర్ణ వ్యవస్థలోకి ప్రవేశిస్తాయన్నారు. పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని, చేతులను తరచూ సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, శీతల పానీయాలు, జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలన్నారు. పరిసరాల పరిశుభ్రత పాటించాల న్నారు. ఈ నెల ఒకటి నుండి ఓఆర్ఎస్ ప్యాకెట్లను 0–5 సంవత్సరాల వయసు పిల్లలు కలిగిన ప్రతి ఇంటికి అందించాలన్నారు. సీహెచ్‌వోలు హెచ్‌డబ్ల్యూసీలలో అన్ని వేళల్లో అందుబాటులో ఉండాలని, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు సరిపడా ఉండేలా చూసుకోవాలన్నారు. అత్యవసర మందులు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో అతిసార నిలుపుదల ప్రచారంపై ర్యాలీలు, సమావేశాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో ఆరోగ్య విస్తరణాధికారి పి.శ్రీనివాసరావు, పీహెచ్ఎన్ మీనాక్షమ్మ, పర్యవేక్షకురాలు వరలక్ష్మి, నాగరాణి, అనిల్, మణిరావు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఉన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ మేకల హనుమంతరావు, తదితరులు



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డాక్టర్ ప్రదీప్, వైద్య సిబ్బంది

తప్పుడు డాక్యుమెంట్ సృష్టించిన వారిపై కేసు నమోదు

సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమ ఆస్తులను అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకుని ఆస్తులను ధ్వంసం చేసి పదే పదే దాడులకు పాల్పడుతున్న ఐదుగురు వ్యక్తులపై సత్తెనపల్లి పట్టణ పోలీసులు కేసు నమోదు చేసినట్లు ప్రస్తుత మఠాధిపతి చింతాడ లలితాంబ మాతాజీ తెలిపారు. సోమవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. పట్టణంలోని గుంటూరు రోడ్‌లో 1939లో చింతాడ సూర్య ప్రకాష్‌రావ్‌చే నిర్మించబడిన శ్రీ సనారీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆశ్రమానికి దాతలు 2.70 ఎకరాల భూమిని 1966లో ఆశ్రమ మఠాధిపతి గురూజీ పేరుతో రిజిస్టర్ చేశారు. కొందరు ఆశ్రమ ఆస్తులను ఆక్రమించాలని తప్పుడు డాక్యుమెంట్లు తయారుచేసి అధికారులను మోసం చేసి ప్రకాశం జిల్లా అమ్మనబ్రోలులో ఆశ్రమంలో అంతర్భాగంగా ఉన్న సుమారు 48 సెంట్ల భూమిని రిజిస్టర్ చేసుకున్నారు. దీనిపై పదేపదే ఆక్రమించాలని రౌడీలు, గూండాలతో దాడి చేయడంతో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాం. దీనిపై విచారించిన పోలీసులు కుట్ర, అక్రమ చొరబాటు, తప్పుడు డాక్యుమెంటరీ సృష్టి, ఆశ్రమ నిర్వహణకు ఆటంకం కలిగించటం, చంపుతామని బెదిరించడం తదితర సెక్షన్లపై కట్టమూరి విజయ వెంకట లక్ష్మీనరసింహారావు, పెద్దిరెడ్డి గోవిందరెడ్డి, పెద్దిరెడ్డి మంగమ్మ, పెద్దిరెడ్డి దీపిక, కల్లి అంజిరెడ్డి, మరి కొందరిపై విచారణ చేస్తున్నారు. ఈ విషయమై సీఎం చంద్రబాబుకు సత్తెనపల్లి ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకు ఆశ్రమ ఆస్తులను పరిరక్షించాలని, దాడులు చేస్తున్న వారి నుంచి తమను కాపాడాలంటూ విజ్ఞాపన పత్రాలను అందజేయగా, వారు ధైర్యానిచ్చారు. గతంలో తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి గుంటూరు కోర్టులో, సత్తెనపల్లి కోర్టులో దావాలు వేయగా 1966 డాక్యుమెంట్ ప్రకారం 2.70 ఎకరాలు ఆశ్రమానికి సంబంధించినవేనని న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చాయని, శాశ్వత ఇంజక్షన్ ఆర్డర్లు ఇచ్చాయని ఆమె తెలిపారు. ప్రస్తుతం భూకబ్జాదారులు అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న స్థలంలో వేద పాఠశాల, వాసవి నగర్ ప్రధాన రహదారి, అర్చకుల నివాసగృహం ఉన్నాయన్నారు.

గ్రామ సభల ద్వారానే కౌలు రైతులను గుర్తించాలి

ఎమ్మెల్యే ప్రవీణ్‌కు కౌలు రైతు సంఘం వినతి

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో పెదకూరపాడు నియోజకవర్గం ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ నియోజకవర్గ పర్యటన సందర్భంగా సోమవారం క్రోసూరు గ్రామంలో కలిసి మెమోరాండం ఇవ్వడమైంది. కౌలు రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సభ్యులు టి.హనుమంతరావు మాట్లాడుతూ భూ యజమాని సంతకంతో సంబంధం లేకుండా గ్రామ సభల ద్వారానే కౌలు రైతులను గుర్తించే విధంగా చట్ట సవరణ చేయాలని అన్నారు . గత ప్రభుత్వం గతంలో ఉన్న కౌలు రైతు చట్టాలను రద్దు చేసి పంట సాగుదారులు హక్కు చట్టం తీసుకొని రావటం జరిగిందన్నారు . 2011 భూ ఆధీకృత సాగు దారుల హక్కు చట్టం ప్రకారం గ్రామ సభల ద్వారా కౌలు రైతులను గుర్తించి కార్డులు మంజూరు చేయాలని అన్నారు. కౌలు రైతుల పేరుతోనే ఈ-క్రాప్ నమోదు చేసి ప్రభుత్వ పథకాలను వర్తింప చేయాలన్నారు. కులాలకు అతీతంగా భూమిలేని ఓసీ కౌలు రైతులందరికీ కూడా రైతు భరోసా వర్తింపజేయాలని అన్నారు. రైతు సంఘం మండల కార్యదర్శి అత్తోట వెంకట అప్పారావు, కౌలు రైతులు పాల్గొన్నారు.

రవికుమార్‌కు నట కళారత్న జాతీయ పురస్కారం



పురస్కారం అందుకుంటున్న రవికుమార్

సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన వర్ధమాన పౌరాణిక కళాకారుడు బెజగం రవికుమార్‌కు దివంగత మాజీ ప్రధాని పీవీ నరసింహారావు పౌరాణిక నట కళారత్న జాతీయ పురస్కారం ప్రదానం చేశారు. గత నెల 30న తెలుగు వెలుగు సాహితీ వేదిక గ్రేటర్ వరంగల్ వారిచే కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ ఆడిటోరియంలో ఆంధ్ర, తెలంగాణ, ఒడిస్సా, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రల స్థాయిలో వివిధ రంగాలలో ప్రావీణ్యం గడించిన విద్యా, వైద్యం, సాహిత్యం, అర్చక, పురోహిత, రంగస్థల కళా రంగం, సమాజ సేవా రంగాలలో, భరత నాట్యంలో బాల, బాలికలకు పురస్కారాలు ప్రదానం చేశారు. ఇందులో భాగంగా రవికుమార్‌కు శాలువా, పతకం, జ్ఞాపిక, ధ్రువపత్రం అందజేశారు. రవికుమార్ 2022 నుంచి 2024 జూన్ 30 వరకు 36 పురస్కారాలను రెండు తెలుగు రాష్ట్రాల స్థాయిలో అందుకున్నారు. ఈ సందర్భంగా సత్తెనపల్లిలోని వివిధ కళా పరిషత్తుల వారు రవికుమార్‌ను సోమవారం ప్రత్యేకంగా అభినందించారు.

డయేరియాపై అవగాహన



రాజుపాలెం: ఐదేళ్ల లోపు చిన్నారులలో ప్రాణాంతకంగా మారుతున్న డయేరియా వ్యాధిని నిరోధించి మరణాల బారిన పడకుండా ఉండేందుకు ఆరోగ్య సిబ్బంది నివారణ చర్యలు చేపట్టినట్లు హెల్త్ సూపర్‌వైజర్ జీవన్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో డయేరియా నియంత్రణ కార్యక్రమంలో భాగంగా ఓఆర్ఎస్, జింక్ కార్నర్ సోమవారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెల్త్ సూపర్‌వైజర్ మాట్లాడుతూ జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 31 వరకు మండలంలోని అన్ని గ్రామాలలో స్టాప్ డయేరియా కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగా ఐదేళ్లలోపు పిల్లలున్న తల్లిదండ్రులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ ట్యాబ్లెట్లను అందించారు. తల్లిదండ్రులకు డయేరియాపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ కోటేశ్వరరావు, స్టాఫ్ నర్సు చందన, ఫార్మసిస్టు శివాంజనేయులు, ఆరోగ్య కార్యకర్తలు రాజ్యలక్ష్మి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.